బ్రహ్మోత్సవాలకు వేళాయె

- శ్రీవేణుగోపాల, శ్రీసీతారామచంద్రస్వామి ఆలయాలు ముస్తాబు
- 20 నుంచి 28 వరకు ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు


ఫణిగిరి గుట్టపై ఉన్న శ్రీసీతారామచంద్రస్వామి ఆలయం

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ పట్టణ శివారులోని శ్రీవేణుగోపాలస్వామి శ్రీసీతారామచంద్రస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు 20వ తేదీ నుంచి 28వరకు వైభవంగా నిర్వహించనున్నారు. ఈమేరకు ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయాలను అందంగా ముస్తాబు చేశారు. కాగా 20 తేదీన అధ్యయనోత్సవాలతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి.



పట్టణ శివారులోని పరికల రామస్వామి గట్టుపైన స్వయంవ్యక్త శ్రీసీతారామ చంద్రస్వామి ఆలయం వద్ద స్వామివారి కల్యాణోత్సవం, ఎద్దుల పందేలు, సాంస్కృతిక, తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ఉత్సవాలు సాగేది ఇలా..

20, 21 తేదీల్లో ఆలయంలో ద్రావిడ వేదపారాయణం, పల్లకీ సేవలు నిర్వహిస్తారు. 22న పరమ పదోత్సవం ఉంటుంది. 23న శ్రీస్వామివారిని పెండ్లి కుమారునిగా తయారు చేసి గట్టు వద్దకు వేంచేయుట, ధ్వజారోహణము, గరుడ ముద్ద అందుకొను తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారు. 24న సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు, రాత్రి 12 గంటలకు ఎదుర్కోళ్ల మహోత్సవం అనంతరం స్వామి అమ్మవార్ల కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. 25న హోమం, బలిహరణ, ప్రసాద వితరణ ఉంటుంది. మధ్యాహ్నం ఒంగోలు జాతి కోడెల ప్రదర్శన (ఎద్దుల పందేలు), రాత్రి గరుడ సేవ, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. 26న చక్రవరి సేవాకాలం, రాత్రి దోపు ఉత్సవం, ఆశీర్వచనం, పూర్ణాహుతి, శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, కళా ప్రదర్శనలు ఉంటాయి. 27న స్వామివారు రాత్రి పట్టణ ప్రవేశం, పురవీధులలో వివిధ వాహనాలపై స్వామివారి ఊరేగింపు, అనంతరం ఆలయ ప్రవేశం చేస్తారు. 28న ప్రాబోధికి, నివేదన, రాత్రి హరికథా గానం, హరినామ సంకీర్తనలు, పవళింపు సేవ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ గుజ్జుల కొండారెడ్డి, ఫౌండర్ ఫ్యామిలీ, అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించి స్వామి వారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.


ముస్తాబైన వేణుగోపాలస్వామి ఆలయం

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఆహ్వానపత్రిక అందజేత

హుజూర్‌నగర్ : పట్టణంలోని ఫణిగిరి గట్టుపై వేంచేసి ఉన్న శ్రీ సీతారామచంద్రస్వామి వారి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను ఆలయ ఈఓ కొండారెడ్డి సోమవారం హైదరాబాద్‌లో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రిని శాలువాతో సన్మానించారు. ఆయన వెంట కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మల్లికార్జున్ ఉన్నారు.


మంత్రి ఉత్తమ్‌కు ఆహ్వానపత్రిక అందజేస్తున్న ఈఓ కొండారెడ్డి

క్లుప్తంగా

చిలుకూరు తహసీల్దార్‌గా ధృవకుమార్


బాధ్యతలు స్వీకరిస్తున్న తహసీల్దార్ ధృవకుమార్

చిలుకూరు : చిలుకూరు మండల నూతన తహసీల్దార్‌గా ధృవకుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన జనగామ జిల్లా నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో రెవెన్యూ సమస్యలను నిబంధనల ప్రకారం పరిష్కరిస్తామని తెలిపారు.

మోతె తహసీల్దార్‌గా సంఘమిత్ర


బాధ్యతలు స్వీకరిస్తున్న తహసీల్దార్ సంఘమిత్ర

మోతె : మోతె మండల నూతన తహసీల్దార్‌గా కె.సంఘమిత్ర సోమవారం బాధ్యతలు స్వీకరించారు. దేవరకొండ మండలంలో డివిజనల్ అడ్మినిస్ట్రేటీవ్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న ఆమె బదిలీపై మోతెకు వచ్చారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మోతె మండలంలో ప్రజలకు, రైతులకు నిత్యం అందుబాటులో ఉంటానని తెలిపారు.

సాగర్ ఎడమ కాలువకు నీటిని విడుదల చేయాలి

నేరేడుచర్ల : నాగార్జునసాగర్ ఎడమ కాలువకు నీటిని విడుదల చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధనుంజయనాయుడు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం నేరేడుచర్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సాగర్ ఎడమ కాలువ పరిధిలో ఇప్పటికే 30 శాతం మేర బోర్లు, బావులు అడుగంటాయని, దీంతో చేతికొచ్చిన పంట ఎండిపోతుండడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. సాగర్‌లో 510 అడుగుల మేర నీరు ఉన్నందున నీటిని విడుదల చేసి చెరువులను నింపి పంటలతో పాటు తాగునీటి సమస్యను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ఎల్లబోయిన సింహాద్రి, పట్టణ కార్యదర్శి కత్తి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు రావుల సత్యం తదితరులు ఉన్నారు.

సొంత ఖర్చుతో రహదారులకు మరమ్మతులు


వీధుల్లో మట్టి పోయించి చదును చేయిస్తున్న ఓరుగంటి రవి


మునగాల : మండలంలోని బరాఖత్‌గూడెం గ్రామపంచాయతీ పరిధిలోని శ్రీనివాసనగర్ కాలనీలో గల పలు వీధుల్లో రహదారులు గుంతలమయంగా మారడంతో గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఓరుగంటి రవి తన సొంత ఖర్చుతో మరమ్మతులు చేయించాడు. అంతేకాకుండా వీధులకు ఇరుపక్కల ఉన్న కంపచెట్లను తొలగించాడు. ఈ సందర్భంగా రవికి కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు అల్పాహారం పంపిణీ ప్రారంభం


విద్యార్థులకు అల్పాహారం అందజేస్తున్న దాత రాచకొండ శ్రీనివాస్‌రావు

నేరేడుచర్ల : మండలంలోని మేడారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు ఉదయం, సాయంత్రం వేళలో జరిగే ప్రత్యేక తరగతుల సమయంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అల్పాహారం అందజేసే కార్యక్రమాన్ని దాత రాచకొండ శ్రీనివాస్‌రావు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చల్లా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకొని పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ యడవల్లి సత్యనారాయణరెడ్డి, జిల్లా చైర్మన్ బట్టు మధు, క్లబ్ కార్యదర్శి జిలకర రామస్వామి, హెచ్‌ఎం శోభన్, ఉపాధ్యాయులు ఆర్.వెంకట్‌రెడ్డి, ఆర్.సత్యనారాయణ, జి.కవిత, గంగయ్య, టీజీ చారి, భాస్కర్, విజయ తదితరులు ఉన్నారు.

'జువారి' సీఎస్‌ఆర్ నిధులతో మరుగుదొడ్ల సౌకర్యం


మరుగుదొడ్లను ప్రారంభిస్తున్న పరిశ్రమ ప్రతినిధులు

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెం మండలం బుగ్గమాధవరం ప్రాథమిక పాఠశాలలో జువారి సిమెంట్ పరిశ్రమ సీఎస్‌ఆర్ నిధులతో నిర్మించిన మరుగుదొడ్లను సోమవారం కంపెనీ ప్రతినిధులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, స్థానికులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు దేశభక్తిని అలవర్చుకోవాలి

కోదాడఅర్బన్ : విద్యార్థులు బాల్యం నుంచి విద్యతో పాటు దేశభక్తిని అలవర్చుకోవాలని కోదాడ బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు దేవబత్తిన నాగార్జున, సాదు శరత్‌బాబు అన్నారు. గణతంత్ర వేడుకల్లో భాగంగా ఢిల్లీలో నిర్వహించిన పరేడ్‌లో రాష్ట్రపతి, ప్రధానమంత్రికి గాడ్ ఆఫ్ ఆనర్‌గా పాల్గొన్న కోదాడకు చెందిన న్యాయవాది తూములూరి సీతారామరాజు– మంజుల దంపతుల కుమారుడు, ఎన్‌సీసీ విద్యార్థి హర్షిత్‌సాయిని సోమవారం కోర్టు హాల్‌లో బార్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సత్కరించారు. బార్ అసోసియేషన్ కార్యవర్గం, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొని విద్యార్థి హర్షిత్‌ను అభినందించారు.


ఎన్‌సీసీ విద్యార్థి హర్షిత్‌సాయిని సత్కరిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

ఘనంగా శ్రీజగదాంబమాత విగ్రహ ప్రతిష్ఠ


బాడవాతండాలో జగదాంబమాతకు పూజలు నిర్వహిస్తున్న గిరిజన పెద్దలు, మహిళలు

మఠంపల్లి : మండలంలోని బాడవాతండాలో గిరిజనుల ఆరాధ్య దైవం శ్రీశ్రీ జగదాంబమాత విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాన్ని సోమవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన పూజారులు రమేష్ గిరిజామహారాజ్, వేద పండితులు సముద్రాల సిద్ధార్థ ఆచార్యులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి విగ్రహ ప్రతిష్ఠ గావించారు. జెడ్పీటీసీ బానోతు జగన్‌నాయక్‌–భారతీ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గోవింద్‌నాయక్, మాజీ ఉపసర్పంచ్ బాలునాయక్, వినాయక్, నాగమణి, శ్రీను, నాగా, హంసాలి, తారాసింగ్, ఠావుర్యా, భద్రు, ధర్మానీబాయి, గిరిజనులు, మహిళలు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో గ్రామాలు

అనంతగిరి: తెలంగాణ పల్లెలు అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్నాయని ఎంపీపీ చుండూరి వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం అనంతగిరి మండలంలోని లకారం గ్రామంలో ఉపాధి హామీ పథకం నిధులతో ఒకటవ వార్డులో రూ.5 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు, నాల్గవ వార్డులో రూ.15 లక్షలతో చేపట్టిన డ్రెయినేజీ, సీసీరోడ్డు, ఆరవ వార్డులో రూ.5లక్షలతో చేపట్టిన డ్రెయినేజీ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు శ్రీనివాసరెడ్డి, ప్రత్యేకాధికారి రవి కుమార్, పీఆర్ ఏఈ హర్ష, బుర్ర పుల్లారెడ్డి, బుర్ర నర్సింహారెడ్డి, బుర్ర ప్రమోద్‌రెడ్డి, గునుకుల గోపాల్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ నాగుల్ మీర, షేక్ కబీర్‌సాహెబ్, కొండయ్య, బాబిరెడ్డి, జలందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మోతె : మండలంలోని గోపతండా, కూడలి, రాంపురంతండా గ్రామాల్లో సోమవారం సీసీ రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణ పనులకు జెడ్పీటీసీ పుల్లారావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మోతె : సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న నాయకులు

మౌలిక వసతుల కల్పనకు కృషి

గరిడేపల్లి : గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనపై కృషి చేస్తున్నట్లు ఎంపీపీ పెండెం సుజాతాశ్రీనివాస్‌గౌడ్ అన్నారు. సోమవారం గరిడేపల్లి మండలంలోని అప్పన్నపేట గ్రామంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ. 5లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ పెండెం శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు త్రిపురం అంజన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఎడవెల్లి చంద్రారెడ్డి, ఎంపీటీసీ కడవ ఇసాక్, నందిపాటి కవతి, జానయ్య, భిక్షం, అంజయ్య, బాలసైదులు, తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా జీవధ్వజం, విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవం


ఆలయంలో ప్రతిష్ఠించిన దేవతామూర్తులు

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెంలోని శ్రీ ఉమామహేశ్వరస్వామి ఆలయ జీవధ్వజ స్తంభ ప్రతిష్ఠ, నూతనంగా నిర్మించిన శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో దేవతా విగ్రహాలు, జీవధ్వజ స్తంభ ప్రతిష్ఠ, పూజలు సోమవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. తదుపరి అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ పూజారులు, నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.


ధ్వజస్తంభం ప్రతిష్ఠిస్తున్న నిర్వాహకులు, భక్తులు

సేవాలాల్‌కు ఘన నివాళి

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సోమవారం గిరిజనుల ఆరాధ్యదైవం శ్రీ సంత్ సేవాలాల్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంత్ సేవాలాల్ చిత్రపటానికి సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు ధరావత్ రవీందర్‌నాయక్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేన మండల అధ్యక్షుడు హుస్సేన్‌నాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పద్మ, శోభన్‌బాబు, శ్రీనివాస్‌నాయక్, అజ్మీరా వెంకట్‌నాయక్, నాగేశ్వరరావునాయక్, రమేష్‌నాయక్, శంకర్‌నాయక్, కృష్ణనాయక్, రాములు, తదితరులు పాల్గొన్నారు.


సేవాలాల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గిరిజన నాయకులు

భువనగిరి నుంచి అయోధ్యకు ప్రత్యేక రైలు

హుజూర్‌నగర్ : అయోధ్యలోని శ్రీరామమందిరాన్ని దర్శించుకునేందుకు నల్లగొండ పార్లమెంటు నియోజకవర్గ భక్తులకు బీజేపీ ఆధ్వర్యంలో భువనగిరి రైల్వే స్టేషన్ నుంచి మంగళవారం సాయంత్రం 4 గంటలకు ప్రత్యేక రైలు బయలుదేరుతుందని బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కన్వీనర్ అంబళ్ల నరేష్ తెలిపారు. సోమవారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. అయోధ్యయాత్ర కోసం ముందుగా నమోదు చేసుకున్న వారు మధ్యాహ్నం 2 గంటల వరకు భువనగిరి రైల్వే స్టేషన్ చేరుకోవాలని సూచించారు. రద్దీగా ఉండే ప్రదేశానికి వెళ్తున్నందున విలువైన ఆభరణాలు, వస్తువులు వెంట తెచ్చుకోవద్దని తెలిపారు. అయోధ్య యాత్ర కోసం నమోదు చేసుకున్న వారు ఆధార్ కార్డు రైల్వే స్టేషన్‌లో చూపిస్తే వారికి యాత్ర గుర్తింపు కార్డు ఇస్తారని తెలిపారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలని ఆందోళన


వల్లాపురంలో ఖాళీ బిందెలతో ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

నడిగూడెం : మండల పరిధిలోని వల్లాపురంలో గల ఒకటవ వార్డులో తాగునీటి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఆ కాలనీవాసులు ఖాళీ బిందెలతో ఆందోళన చేపట్టారు. తాగునీటి సమస్య పరిష్కరించాని సంబంధిత అధికారులను కోరినా వారు స్పందించడంలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ఉపాధ్యక్షుడు వట్టికూటి పాపయ్య, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు గుర్వయ్య, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఊర చెరువును కాపాడాలని కలెక్టర్‌కు వినతి

నేరేడుచర్ల : మండలంలోని పెంచికల్‌దిన్న గ్రామంలో అన్యాక్రాంతమవుతున్న ఊర చెరువు భూమిని కాపాడాలని కోరుతూ సోమవారం సూర్యాపేట జిల్లా కలెక్టర్ వెంకట్రావ్‌కు కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ నేరేడుచర్ల మండల అధ్యక్షుడు ఉట్కూరి భార్గవ సైదులు వినతిపత్రం అందజేశారు. చెరువు కింద సుమారు 170 ఎకరాల సాగు భూమి ఉందని, చెరువు చుట్టూ పొలాలు ఉన్న వ్యవసాయదారులు ఆ భూమిని కబ్జా చేస్తున్నారని ఆ వినతి పత్రంలో పేర్కొన్నారు. చిన్న, సన్నకారు రైతులు ఈ చెరువు నీటిపైనే ఆధారపడి సాగు చేపడుతున్నారని, చెరువు కబ్జాకు గురికావడంతో వారు ఆందోళనలో ఉన్నారని పేర్కొన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో సుంకర వెంకటేశ్వర్‌రావు, సిరికొండ కృష్ణ, సైదులు, శ్రీను, వెంకటేశ్వర్లు ఉన్నారు.

టెన్త్ ఇంటర్నల్ మార్కుల పరిశీలన


ఇంటర్నల్ మార్కులు పరిశీలిస్తున్న హెచ్‌ఎం కరుణాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు

చిలుకూరు : నిబంధనల ప్రకారం పదవ తరగతి ఇంటర్నల్ మార్కులు పరిశీలిస్తున్నట్లు చిలుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కరుణాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం చిలుకూరు మండల పరిధిలోని గ్లోబస్ ఇంటర్నేషనల్ పాఠశాలలో పదవ తరగతి ఇంటర్నల్ మార్కులను ఉపాధ్యాయుల బృందంతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్జెక్టు వారిగా నోట్ పుస్తకాలు, ఎఫ్‌ఏ పరీక్షల మార్కుల తదితర అంశాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఉపేందర్, ఉపాధ్యాయులు, టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

రెండవ ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలి

కోదాడఅర్బన్ : రాష్ట్రంలో సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న రెండవ ఏఎన్‌ఎంలను ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సోమవారం కోదాడలోని సీపీఐ కార్యాలయంలో జరిగిన రెండవ ఏఎన్‌ఎంల జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరోగ్య కేంద్రాల్లో రెండవ ఏఎన్‌ఎంలతో వెట్టిచాకిరీ చేయిస్తున్న ప్రభుత్వం వారికి సరైన వేతనాలు ఇవ్వడం లేదన్నారు. వారికి ఇన్సూరెన్స్, పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలని, ఎనిమిది గంటల పనివిధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రెండవ ఏఎన్‌ఎం నాయకురాళ్లు రాధా, మమత, జయప్రద, గీత, నీరజ, రమాదేవి, కవిత, పద్మ, శైలజ, రజియా, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మేకల శ్రీనివాసరావు

కనీస వేతనం అమలు చేయాలి

కోదాడఅర్బన్ : వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం రూ. 26,000లు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు మిట్టగడపల ముత్యాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కోదాడలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సామిల్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత 30 ఏళ్లుగా కోదాడలో సామిల్‌లో పనిచేస్తున్న కార్మికులకు అతి తక్కువ వేతనం అందిస్తుండడంతో వారు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం సామిల్ వర్కర్స్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నాగేల్ల రాములు, కార్యదర్శిగా వాంకుడోత్ శ్రీను, ఉపాధ్యక్షుడిగా కొరివి పిచ్చయ్య, సహాయ కార్యదర్శిగా పంది రాంబ్రహ్మం, కోశాధికారిగా బానోత్ బాబుతో పాటు పదిమంది సభ్యులతో కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ముత్యాలు

ఛత్రపతి శివాజీ జీవితం ఆదర్శనీయం


నేరేడుచర్ల : ఛత్రపతి శివాజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాతరం యూత్ సభ్యులు


నడిగూడెం : ఛత్రపతి మహారాజ్ యువజన సంఘం ఆధ్వర్యంలో..

నేరేడుచర్ల : ఛత్రపతి శివాజీ జీవితం ఆదర్శనీయమని మాతరం యూత్ సభ్యులు అన్నారు. పట్టణంలోని ప్రధాన కూడలిలో సోమవారం మాతరం యూత్ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాతరం యూత్ అధ్యక్షుడు జింకల భాస్కర్, సైదులు, నాగిరెడ్డి, శంకర్‌రెడ్డి, సురేష్, రమేష్, బాల వెంకటేశ్వర్లు, నవీన్, ధనుంజయనాయుడు, శ్రీను, శ్రవణ్, నర్సింహా, కిరణ్, నాగయ్య, మనోహర్‌రెడ్డి, మట్టయ్య తదితరులు ఉన్నారు.

నడిగూడెంలో..

నడిగూడెం : మండల కేంద్రంలో ఛత్రపతి శివాజీ 394వ జయంతి వేడుకలను సోమవారం ఛత్రపతి శివాజీ మహారాజ్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు కొల్లోజు శివకృష్ణ, బీజేపీ మండల అధ్యక్షుడు దున్నా సతీష్, బీఆర్‌ఎస్ నాయకుడు నూనె నాగన్న, సభ్యులు జి.శివ, వినోద్, జ్ఞానదీప్‌రెడ్డి, నర్సింహ పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవం


కలశాలకు పూజ నిర్వహిస్తున్న వేద పండితులు

కోదాడఅర్బన్ : కోదాడ పట్టణంలోని హుజూర్‌నగర్ రోడ్డులో ప్రసిద్ధిగాంచిన అయ్యప్పస్వామి దేవాలయ 21 వార్షికోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం స్వామివారికి అభిషేకం చేసి, పూలతో అలంకరించారు. శబరిమలైలో జరిగేవిధంగా స్వామివారి ఉత్సవమూర్తులను ఊరేగింపుగా రామ్మూర్తినగర్‌లో గల బావివద్దకు తోడ్కొని వెళ్లి జలాధివాసం చేయించి ఆరట్టు ఉత్సవం నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను ఆలయానికి తోడ్కొని వచ్చారు. ఈ సందర్భంగా వేదపండితులు విఘ్నేశ్వరునికి, సుబ్రహ్మణ్యస్వామికి మాలిక పురత్తర అయ్యప్పస్వామికి అష్టాదశ కలశాభిషేకం నిర్వహించారు. భక్తులకు కందిబండ మోహన్‌రావు, అమృతరెడ్డి, గడ్డం వెంకటసూర్యారెడ్డిల ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన కార్యదర్శి చల్లా రామ్మూర్తి, సభ్యులు పాల్గొన్నారు.

మెడికల్ షాపును సీజ్ చేసినా తెరిచారు

- సస్పెన్షన్‌లో ఉండగానే తెరవడంతో మారోసారి అధికారుల తనిఖీ
- నోటీసులు జారీ చేసిన డ్రగ్ ఇన్‌స్పెక్టర్

కోదాడ: నిబంధనలు పాటించడం లేదని, మందులకు బిల్లులు ఇవ్వడం లేదని కోదాడలో మెడికల్ షాపులపై ఫిర్యాదులు రావడంతో ఈ నెల 2న జిల్లా ఔషధ నియంత్రణ అధికారులు కోదాడలో ఉన్న పలుషాపులపై దాడులు నిర్వహించారు. సదరు దుకాణాల్లో పలు లోపాలను గుర్తించారు. అనంతరం ఈ నెల 17న ఆరు దుకాణాలకు నోటీసులు జారీ చేశారు. దీనిలో పేర్కొన్న ప్రకారం కొన్ని దుకాణాలు 3 రోజులు, మరికొన్ని 7రోజులు, 10 రోజులు, 18 రోజుల వరకు దుకాణాలు తీయవద్దని తాత్కాలిక సస్పెన్షన్ విధించారు. ఈ క్రమంలో సోమవారం వరకు సస్పెన్షన్‌లో ఉన్న ఓ వైద్యశాలలో నిర్వహిస్తున్న మందుల దుకాణ యజమాని తన దుకాణంలో కాకుండా అదే వైద్యశాలలో ఉన్న ఎమర్జెన్సీ కేర్‌లో మందులను ఉంచి అమ్ముతున్నాడు. దీనిపై కొందరు ఫిర్యాదు చేయడంతో సోమవారం సూర్యాపేట డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సురేందర్ మరోసారి తనిఖీలు చేశారు. ఎమర్జెన్సీ కేర్‌లో ఉంచిన మందులను ఆయన పరిశీలించి వాటిని ఎందుకు అక్కడ ఉంచారో తెలపాలని మరోసారి నోటీసులు జారీ చేశారు. దీంతో పాటు గతంలో నోటీసులు జారీ చేసిన దుకాణాలు మూసి ఉన్నాయా, తెరిచారా అన్న విషయాన్ని ఆయన మరోసారి పరిశీలించారు. ఈ సందర్భంగా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సురేందర్ మాట్లాడుతూ ఫిర్యాదులు అందిన వైద్యశాలలోని మందుల దుకాణాన్ని పరిశీలించామని, ఎమర్జెన్సీ కేర్‌లో ఉంచిన మందుల విషయంపై వైద్యశాల వారికి నోటీసు జారీ చేశామని, లైసెన్స్ సస్పెన్షన్‌లో ఉన్న దుకాణాలను తెరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.


ఎమర్జెన్సీ కేర్‌లో ఉంచిన మందులను తనిఖీ చేస్తున్న ఔషధ నియంత్రణ అధికారి

రేపటి నుంచి హరేరామ నామ సంకీర్తన

మునగాల : మండల కేంద్రంలోని పురాతనమైన శ్రీరామలింగేశ్వర హనుమాన్ దేవాలయ 64వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 21వ తేదీ నుంచి 24 వరకు 72గంటల (మూడు రోజులు రేయింబవళ్లు) పాటు అఖండ హరేరామ నామ సంకీర్తన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ తూముల వీరస్వామి సోమవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి సహకరిస్తున్న దాతలు, భక్తులకు వీరస్వామి కృతజ్ఞతలు తెలిపారు. ఈ మహోత్తర కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు.

పీఎం విశ్వకర్మ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నడిగూడెం : ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్థానిక సీఎస్‌సీ కేంద్రం నిర్వాహకుడు జలగం శివకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. 18 రకాల కుల వృత్తుల వారు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తమ సీఎస్‌సీ కేంద్రంలో ఉచితంగా ఆన్‌లైన్ చేయనున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్ చేసుకున్న చేతివృత్తుల వారికి వృత్తి నైపుణ్యంపై శిక్షణ కూడా ఇస్తారన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

- రూ.లక్షన్నర ఎత్తుకెళ్లిన దుండగులు


ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్‌ఐ

మునగాల : పట్టపగలే దుండగులు తెగబడ్డారు. తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడి రూ.లక్షన్నర నగదుతో ఉడాయించారు. మునగాల మండలం బరాఖత్‌గూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని శ్రీనివాసనగర్‌లో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీనివాసనగర్ కాలనీకి చెందిన గడ్డం రాంబాబు వ్యవసాయ పనుల నిమిత్తం సోమవారం ఇంటికి తాళం వేసి పొలం వద్దకు వెళ్లాడు. గమనించిన గుర్తుతెలియని వ్యక్తులు రాంబాబు ఇంటి తాళం పగులగొట్టి లోనికి ప్రవేశించారు. బీరువాలో ఉన్న నగదుతో పాటు ఓ సెల్‌ఫోన్‌ను అపహరించుకుపోయారు. పొలం పనులు ముగించుకొని సాయంత్రం రాంబాబు ఇంటికి వచ్చి చూసేసరికి చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మునగాల సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్‌ఐ అంజిరెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుకుని దర్యాప్తు చేస్తున్నారు.